మోసం చేయడం చంద్రబాబు నైజం

ప్రతి ఒక్కరిని నమ్మించి మోసం చేయడం చంద్రబాబుకు వెన్నెతో పెట్టిన విద్య. 2014లో కూడా నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. అప్పుడు ఐదేళ్ల పాలనలో అమలు చేయలేదు. 2024 ఎన్నికల్లో నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తానని ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటింది. అయినా ఉలుకు పలుకు లేదు. హామీల పేరుతో ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య.

పి. రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్, కమలాపురం



- ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి హామీ
- అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటినా పట్టించుకోని వైనం

భృతినివ్వు.. బాబూ

సాక్షి, నెట్‌వర్క్ : ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్‌లో నిరుద్యోగులకు పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటించింది. ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చింది. ఉద్యోగాలు కల్పించేంత వరకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేల భృతి ఇస్తామని వాగ్దానం చేసింది. ఈ విషయాన్ని ఎన్నికల ప్రచారంలో ఊదర గొట్టారు. దీంతో నిరుద్యోగులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై నెల రోజులు దాటినా ఇంత వరకు ఈ పథకం అమలుకు నోచుకోలేదు. డీఎస్సీ తప్ప మిగతా ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు విడుదల చేయలేదు. దీంతో జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు. అంత వరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వెంటనే నిరుద్యోగ భృతి హామీ అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వాస్తవానికి 2014 ఎన్నికల సందర్భంగా చంద్రబాబు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటైన నాలుగేళ్ల వరకు ఆ ఊసే లేదు. చివరి సంవత్సరంలో రూ.2 వేల చొప్పున కొందరికి మాత్రమే నిరుద్యోగ భృతి చెల్లించారు. మునుపటి అనుభవాలను గుర్తు చేసుకుంటున్న నిరుద్యోగులు మళ్లీ అదే పరిస్థితి వస్తుందేమోనని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.



నిరుద్యోగ భృతి ఎప్పుడు?



2014లో నిరుద్యోగులకు రూ. 2 వేలు గౌరవ భృతిని చెల్లిస్తామని చంద్రబాబు ప్రకటించారు. కానీ అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ పథకాన్ని అమలు చేయలేకపోయారు. 2024 ఎన్నికల ప్రచారంలో నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెల రోజులు దాటినా ఇప్పటివరకు నిరుద్యోగ భృతి పథకంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. ప్రభుత్వం వెంటనే ఈ పథకాన్ని అమలు చేయాలి.

- మహమ్మద్ షాషావలి నిరుద్యోగి, జమ్మలమడుగు

చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలి. నిరుద్యోగ భృతిపై చంద్రబాబు మాటకు కట్టుబడి ఉండాలి. ఎప్పటి నుంచి అమలు చేస్తారో క్లారిటి ఇవ్వాలి. వెంటనే జాబ్ కేలండర్ విడుదల చేయాలి. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుద్యోగులకు న్యాయం చేయాలి.

- లక్ష్మణ్, నిరుద్యోగి, జమ్మలమడుగు.

స్పష్టమైన ప్రకటన చేయాలి



టీడీపీ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన వెంటనే నిరుద్యోగ భృతి అమలు చేస్తామన్నారు. వెంటనే నిరుద్యోగులకు స్పష్టత ఇవ్వాలి. ఆరు గ్యారంటీ పథకాలు పేరుతో ప్రజలకు హామీ ఇచ్చారు. ఉద్యోగాలు ఇవ్వలేని పక్షంలో నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారు. ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. వెంటనే నిరుద్యోగ భృతి పథకాన్ని అమలు చేయాలి.

- దేవిడ్‌రాజ్, జనవిజ్ఞాన వేదిక నాయకుడు

ప్రతి హామీని అమలు చేయాలి



టీడీపీ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన వెంటనే ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం లేకపోతే నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదు. వెంటనే అమలు చేయాలి. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలి.

- ఓబులేసు, రాయలసీమ విద్యార్థి సంఘం నాయకుడు

కాలయాపన వద్దు



నా పేరు మహేంద్రారెడ్డి. డిప్లొమో పూర్తి చేశా. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ యువతీ, యువకులకు చంద్రబాబు నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చాడు. వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రాలేదు. ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చర్యలు తీసుకోవాలి. విధివిధానాల పేరుతో కాలయాపన చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇచ్చే విధంగా ప్రభుత్వం దృష్టిపెట్టి హామీ అమలు అయ్యేలా చూడాలి.

- మహేంద్రారెడ్డి, నిరుద్యోగి, వేముల

ఆశలు పెట్టుకున్నాం



ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు ప్రకటించిన ప్రతి హామీని అమలు చేయాలి. నిరుద్యోగులకు వెంటనే నిరుద్యోగ భృతి ఇచ్చి ఆదుకోవాలి. నిరుద్యోగ భృతిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు దాటింది. పథకం అమలుపై ఇంకా స్పష్టత రాలేదు. ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నాలాంటి వారికి ఈ నిరుద్యోగ భృతి అందిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

- రాణి, ఉప్పలూరు, ముద్దనూరు మండలం

ఆదుకోవాలి



కూటమి నేతల ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. అధికారంలోకి వస్తే ప్రతి నెల రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పడి 40 రోజులు కావస్తున్నా నిరుద్యోగ భృతి పై ఎలాంటి ప్రకటన చేయలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిరుద్యోగ భృతి ఇచ్చి ఆదుకోవాలి. అలాగే నిరుద్యోగుల వయో పరిమితి కూడా సడలించాలి.

-కె. నాగ భూషణం, పెద్దచెప్పలి, కమలాపురం మండలం

హామీ అమలు చేయాలి



నా పేరు హర్షవర్ధన్‌రెడ్డి, డిగ్రీ పూర్తి చేశారు. ఉద్యోగం లేక ఇంటి వద్దనే ఉంటున్నాను. ఎన్నికల హామీలో చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తానని బహిరంగ సభలో ప్రజల సాక్షిగా హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం పట్టించుకోలేదు. ఉద్యోగం లేక ఇంటి వద్దనే ఉన్నా. నిరుద్యోగ యువతీ, యువకులకు వెంటనే నిరుద్యోగ భృతి చెల్లించాలి. ఇచ్చిన హామీని అమలు చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలి.

- హర్షవర్ధన్‌రెడ్డి, నిరుద్యోగి, వేముల

కమలాపురం నియోజకవర్గం	
మండలం	కుటుంబాల సంఖ్య
కమలాపురం	15812
వల్లూరు	9305
పెండ్లిమర్రి	14666
వీరపునాయునిపల్లె	10545
చింతకొమ్మదిన్నె	11995
చెన్నూరు	11296
మొత్తం	73,619

నిరుద్యోగ భృతి ఊసేలేదు

2014 ఎన్నికల్లో గెలిచినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటికొక ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మాట తప్పారు. ఇప్పుడు సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన వారికి ఇంటికో ఉద్యోగం లేదంటే రూ. 3 వేలు భృతి కింద ఇస్తామని చెప్పి ఇంతవరకు ఆ ఊసే ఎత్తకపోవడం విచారకరం.

- పి.వెంకట రమణ, నిరుద్యోగి, చక్రాయపేట

చంద్రబాబు మాట తప్పవద్దు



ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతి, యువకులకు తక్షణమే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. గతంలో మాదిరి నిరుద్యోగులను మోసం చేయకుండా అందరికీ ఉద్యోగాలు కల్పించే వరకు ఆర్థిక సాయంగా నిరుద్యోగ భృతిని అందిస్తే వారి ఎంతో తోడ్పాటు ఇచ్చినట్లు అవుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల దాటిన ఇంతవరకు ఎటువంటి మార్గదర్శకాలు ఇవ్వలేదు. చంద్రబాబు మాట తప్పవద్దు.

- షేక్. ఖలీల్ బాషా, వేంపల్లె

భృతిపై ఊసే లేదు



కూలమి ప్రభుత్వం ఏర్పడి నెలగడుస్తున్నా నిరుద్యోగుల సమస్యలపై ఊసే ఎత్తలేదు. ఎన్నికల ముందు నిరుద్యోగ భృతి హామీ అయితే ఇచ్చారు గాని అమలుపై ఎటువంటి మార్గదర్శకాలు ఇవ్వలేదు. ఉద్యోగాలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుద్యోగ భృతిని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

- కె వి రమేష్, వేంపల్లె

'గర్భిణి అని కూడా చూడకుండా వేధిస్తున్నారు'

కడప రూరల్ : తాను నిండు గర్భిణివ అని చూడకుండా పోలీసులు కేసును ఉపసంహరించుకోవాలని వేధిస్తున్నారని అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె చిన్న ఓరంపాడుకు చెందిన దార్ల సారమ్మ ఆరోపించారు. సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తన భర్త ఆనందబాబును కృష్ణానగర్‌కు చెందిన ఒక మహిళ ట్రాప్ చేసి రూ.లక్ష తీసుకుని మోసం చేసిందని ఆరోపించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని నిండు గర్భిణి అని చూడకుండా తమను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్తకు ప్రాణహాని ఉందని, నా కుటుంబాన్ని రక్షించాలని కోరారు.

విద్యార్థి వాసంతి మృతి కారకులను శిక్షించాలి

కడప ఎడ్యుకేషన్ : నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో విద్యార్థిని వాసంతిని కిరాతకంగా అత్యాచారం చేసి చంపిన నిందితుల్ని కఠినంగా శిక్షించాలని ఆర్‌ఎస్‌యూ నగర అధ్యక్షుడు కొండేటి హరిబాబు డిమాండ్ చేశారు. వాసంతి ఆత్మకు శాంతి కలగాలని సోమవారం కడప నగరంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులతో కలిసి కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసంతి మృతదేహం ఆచూకీ ఇంత వరకు లభించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

డిప్యూటీ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్ : కొండాపురం డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని అదే మండలం కె.సుగుమంచిపల్లె గ్రామానికి చెందిన పి.చెన్నారెడ్డి సోమవారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. తనకు సర్వహక్కులు ఉన్న 33 సెంట్ల భూమిని రాజేశ్వరి ఆర్‌ఐగా పని చేస్తున్న సమయంలో రికార్డులు తారుమారు చేసి పుల్లయ్య, బి.వెంకట కృష్ణారెడ్డి పేర్లతో ఆన్‌లైన్ చేసి తన అత్త పేరుపై రిజిస్టర్ చేయించుకుందని ఆరోపించారు. దీనిపై జమ్మలమడుగు డీఎస్పీని ఆశ్రయించగా రికార్డులు పరిశీలించి డీటీ రాజేశ్వరిపై కేసు నమోదు చేయాలని తాళ్ల ప్రొద్దుటూరు ఎస్‌ఐని ఆదేశించారన్నారు. అప్పటి తహసీల్దార్ ప్రభాకర్‌రెడ్డి, డీటీ రాజేశ్వరి, మరో ఆరుగురిపై క్రిమినల్ కేసు నమోదు

మసీద్ నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళం



మసీద్ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న న్యాయవాది లక్ష్మీరెడ్డి

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణంలోని టెక్కాయచేను వీధిలో నిర్మిస్తున్న (అన్వారె ముస్తాఫా) మసీద్ నిర్మాణానికి స్వర్గీయ బైరెడ్డి సూర్యనారాయణరెడ్డి, సుశీలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారి కుమారుడు హైకోర్టు న్యాయవాది బైరెడ్డి లక్ష్మీరెడ్డి మసీద్ కమిటీ సభ్యులకు లక్ష రూపాయలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాది లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా తమ వంతుగా సహాయం చేశామని తెలిపారు. మసీద్ కమిటీ సభ్యులను లక్ష్మీరెడ్డిని ట్రస్ట్ సభ్యులను అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

వల్లూరు : వల్లూరు మండల పరిధిలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు తెలిపారు. పాఠశాలకు చెందిన వై. వర్షిత, డి. అక్షిత, జి. వెంకట సాయి, ఎస్ పూజ శ్రీ, ఎస్. హర్షవర్ధన్, పి. సాహితి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కండక్టర్‌కు నివాళి



తారకరాముడు కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారులు

జమ్మలమడుగు : కండక్టర్ తారకరాముడు మృతదేహానికి ఆర్టీసీ అధికారులు నివాళులర్పించారు. తిరుపతి నుంచి జమ్మలమడుగుకు వస్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో జమ్మలమడుగు డిపోలో పనిచేస్తున్న కండక్టర్ తారకరాముడు (40) ఆదివారం అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ప్రజారవాణా కడప జోనల్ అధికారి గిడుగు వేంకటేశ్వరరావు, గోపాల్ రెడ్డి, డిపో మేనేజర్ ప్రవీణ్ తారకరాముడు మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. సంస్థ తరపు నుంచి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

జాతీయస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీకి ఎంపిక

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని నవనీత జాతీయ స్థాయి ఫ్లోర్ బాల్ పోటీకి ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ యోగాంజనేయులు తెలిపారు. సోమవారం నవనీతను అధ్యాపక బృందం అభినందించింది. కళాశాల వ్యాయామ అధ్యాపకుడు బాలకొండ గంగాధర్, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్రలు విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో జరిగిన ఫ్లోర్ బాల్ పోటీల ఎంపిక సందర్భంగా తమ కళాశాల విద్యార్థిని అత్యంత ప్రతిభ కనబరిచిందని కొనియాడారు. అలాగే ఈ నెల 18, 19, 20 తేదీల్లో హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్ర జట్టు తరపున ఆడేందుకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. తెలుగు అధ్యాపకులు డా.నాగలక్ష్మీదేవి, ఆంగ్ల అధ్యాపకుడు అరవింద్, లైబ్రరీ విభాగాధిపతి మాధవరావు, అధ్యాపకేతర బృందం, విద్యార్థిని ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేశారు.



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పులివెందుల టౌన్ : పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా జీవించవచ్చని లయోలా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అమల్‌రాజ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పెద్దరంగాపురం గ్రామంలో మొదటి సంవత్సరం విద్యార్థులు కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు ఇంటర్‌షిప్ కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, డెంగీ ఫీవర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలోని మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించి శుభ్రం చేశారు. గ్రామ ప్రజలకు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించారు. స్థానికుడు రామకేశవ విద్యార్థులకు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు.



మురుగు కాలువలను శుభ్రం చేస్తున్న లయోలా విద్యార్థులు

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

పులివెందుల టౌన్ : వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ సురేష్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలోని నలంద కళాశాల విద్యార్థులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌లు, కారు డ్రైవర్లు షీట్‌బెల్ట్ పెట్టుకోకపోవడం వలన ఎక్కువ మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ముఖ్యంగా యువత ట్రిపుల్ రైడింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

కమలాపురం: జిల్లాలోని బీడి కార్మికులు చదువుకునే తమ పిల్లల ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని బీడి కార్మికుల వైద్యశాల ఇన్‌చార్జి డాక్టర్ రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 10వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులు ఆగస్టు 31వ తేదీలోపు, ఇంటర్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులు అక్టోబర్ 31వ తేదీ లోపు స్కాలర్‌షిప్.జీటీపీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు స్థానిక బీడి కార్మిక వైద్యశాలలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

క్రీడాకారులకు సన్మానం



సీనియర్ హాకీ క్రీడాకారులను సన్మానిస్తున్న దృశ్యం

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని వైఎస్సార్ హాకీ క్రీడా మైదానంలో జరిగే సౌత్ ఇండియా హాకీ ఛాంపియన్ షిప్ హాకీ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం సీనియర్ హాకీ క్రీడాకారులను సన్మానించారు. కడప హాకీ అసోషియేన్ జిల్లా ప్రెసిడెంట్ రవిచంద్ర, జిల్లా సెక్రటరి శేఖర్, కడప హాకీ ప్రెసిడెంట్ శ్రీనివాసులు వారిని సత్కరించారు. సోమవారం విరామ సమయం కావడంతో సీనియర్ హాకీ క్రీడాకారులను సత్కరించినట్లు వారు తెలిపారు.

విగ్రహ ఆవిష్కరణకు స్థలం కేటాయించాలి

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణంలో భారత దేశ ప్రథమ స్వతంత్ర సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్ర ఆవిష్కరణకు స్థలాన్ని కేటాయించాలని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు యారపురెడ్డి సురేంద్రరెడ్డి, రాష్ట్ర డైరెక్టర్ పెద్దిరెడ్డి గారి పురుషోత్తంరెడ్డి కోరారు. ఈ విషయమై సోమవారం కడపలోని జిల్లా విగ్రహ కమిటీ సభ్యులు ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ప్రభాకర్‌నాయుడును తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ ఆవిష్కరణ అనుమతి కోసం వినతిపత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. ఇందుకు ఆయన అనుకూలంగా స్పందించారని విగ్రహ ఏర్పాటుకు అనుమతితోపాటు స్థలాన్ని కూడా కేటాయిస్తామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కాలవ శ్రీలతరెడ్డి, నేషనల్ కన్వీనర్ నల్లపురెడ్డి వెంగళరెడ్డి పాల్గొన్నారు.



ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ ప్రభాకర్‌నాయుడుకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి

విద్యుత్ బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలి

జమ్మలమడుగు : విద్యుత్‌శాఖాధికారులు మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆ శాఖ ఎస్‌ఈ రమణ పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గం పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులు రైతులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దేశానికి వెన్నుముక లాంటివారని కొనియాడారు. వారి సమస్యలపై సిబ్బంది వెంటనే స్పందించాలని ఆదేశించారు. రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల సమస్య ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. వర్షకాలంలో విద్యుత్ కోతలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ రాజగోపాల్, ఏఈలు రాజబాబు, రామకృష్ణయ్య, శ్రీనివాసవర్మ, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఈ రమణ

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

జమ్మలమడుగు : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ నాయకుడు శివకుమార్ కోరారు. సోమవారం దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శానిటేషన్ అధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం పట్టణంలో డయేరియాతో పాటు జ్వరం ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. పట్టణంలోని ప్రతి వీధిలో కాలువ పూడికతీత పనులు చేపట్టాలని, మురుగు నీరు నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఫాగింగ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్య, రమేష్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.



శానిటేషన్ అధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

'తల్లికి వందనం' పేరుతో ప్రభుత్వం దగా

- జగన్‌పై తప్పుడు కేసు నమోదు దారుణం
- రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం
- మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : 'తల్లికి వందనం' పేరుతో కూటమి ప్రభుత్వం పిల్లలను, తల్లులను దగా చేసిందని మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంతమందికి రూ. 15 వేల చొప్పున ఇస్తామని ఎన్నికల ప్రచారం ఆర్భాటంగా ప్రచారం చేసి కూటమి.. నేడు అధికారంలోకి వచ్చాక హామీని విస్మరిస్తోందని మండిపడ్డారు. ప్రతి ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అందరికీ తల్లికి వందనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జగనన్న ప్రభుత్వం ప్రతి ఏటా జూన్ మాసంలోనే అమ్మ ఒడిని క్రమం తప్పకుండా తల్లుల ఖాతాలో జమ చేశామని గుర్తుచేశారు. 2019–20లో జనవరి 9న 81,72,244 మంది విద్యార్థులకు రూ.6349.6కోట్లు, 2020–21లో జనవరి 11న 83,76,020 మందికి రూ.6673.4కోట్లు, 2021–22లో జూన్ 27న 82,06,302 మందికి రూ.6393.6కోట్లు, 2022–23లో జూన్ 28న 83,15,341 మందికి రూ.6392.94 కోట్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జమ చేసిందని గుర్తుచేశారు. అలాగే సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు సిలిండర్లు, రైతులకు రూ.20 వేలు, నిరుద్యోగ భృతి తదితర పథకాలన్నీ తక్షణం అమలు చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

మాజీ సీఎం వైఎస్ జగన్‌పై కేసు నమోదు దారుణం

ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు మెయిల్ ద్వారా చేసిన ఫిర్యాదు ఆధారంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కేసు నమోదు చేయడం దారుణం అని మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆక్షేపించారు. రాష్ట్రంలో లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, చెన్న కేశవరెడ్డి, వంశీధర్ రెడ్డి, కొండారెడ్డి, దేవదానం పాల్గొన్నారు.

అసత్య ప్రచారం మానుకోవాలి

చింతకొమ్మదిన్నె : కడప నగర సమీపంలోని చెర్లోపల్లిలో వైస్సార్‌సీపీ నాయకులు ఇంటి స్థలాలను కబ్జా చేసినట్లు ఒక పత్రికలో వచ్చిన కథనాలు అవాస్తవమని మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్ రెడ్డి, సర్పంచ్ వర్దిరెడ్డి సురేంద్రరెడ్డి కొట్టిపారేశారు. సోమవారం వారు కడప నగరంలోని వైస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చెర్లోపల్లిలో వైస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ కూడా కబ్జాలు చేయలేదని, అసత్య ప్రచారం మానుకోవాలని హెచ్చరించారు. గతేడాది మండల సర్వసభ్య సమావేశంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను కాపాడాలని వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు ఎంపీటీసీలు తీర్మానం చేసి ఆ పత్రాన్ని ఎంపీడీఓకు, కడప మున్సిపల్ కమిషనర్‌కు అందజేశామని గుర్తుచేశారు. కథనాలు రాసేముందు నిజాలు తెలుసుకుని రాస్తే మంచిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గుడా ప్రభాకర్ రెడ్డి, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.